

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




తుపాను కారణంగా ఎడతెరిపిలేని వర్షంతో జలదిగ్బంధమైన విజయవాడ

# అంతటా అప్రమత్తం



విజయవాడ మొగల్రాజపురం సున్నపుబట్టీ సెంటర్ వద్ద విరిగిపడిన కొండ చరియలు

- ఎడతెరపిలేని వర్షాలపై సీఎం నిరంతర సమీక్ష
- సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు ఆదేశాలు
- రౌండ్ ద క్లాక్ వివరాలు తెలుసుకున్న చంద్రబాబు
- నష్ట నివారణపై దృష్టిపెట్టాలని అధికారులకు ఆదేశాలు
- వివిధ ఘటనల్లో భారీ వర్షాలకు 8 మంది దుర్మరణం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం
- ఉత్తరాంధ్ర కలెక్టర్లకు సన్నద్ధతపై ప్రత్యేక ఆదేశాలు
- హుద్‌హుద్ నివారణ చర్యలు గుర్తుచేసిన సీఎం
- ప్రభావిత జిల్లాలకు తక్షణ సాయానికి నిధుల విడుదల

2 లో

## కలెక్టర్లూ.. బీ అలెర్ట్!

- నేడు కళింగపట్నం వద్ద తీరందాటనున్న తుపాను
- మోస్తరు, భారీ వర్షాలకు ఛాన్స్
- అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి
- సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వద్దు
- 24 గంటలూ కంట్రోల్ రూంనుంచి పర్యవేక్షణ
- విపత్తుల నిర్వహణ మంత్రి అనిత సూచన
- సీఎస్ సహా ఉన్నతాధికారులు నిరంతర సమీక్ష

2 లో



## ప్రజలూ.. జాగ్రత్త వహించండి

- తుపాను వర్షాలపై మంత్రి లోకేష్ పిలుపు
- మంగళగిరిపై గంటగంటకూ సమీక్ష

3 లో



## విద్యార్థులకు అస్వస్థతపై మంత్రి లోకేష్ సీరియస్

- నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ తొలగింపు
- ముగ్గురు సభ్యులతో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు
- ఫిర్యాదుల పరిష్కారానికి కార్యాచరణకు ఆదేశం

4 లో

## భిన్నకోణాల్లో విచారణ

- ఏ అంశాన్నీ తేలికగా తీసుకోవద్దు
- విద్యార్థినులకు పూర్తి ధైర్యమివ్వాలి
- ఆడబిడ్డల రక్షణ విషయంలో రాజీ లేదు
- సైబర్ నిపుణులతోనూ లోతైన దర్యాప్తు
- నిందితులెవరైనా ఉపేక్షించేది లేదు..
- విచారణ కమిటీతో ముఖ్యమంత్రి సమీక్ష
- వివరాలపై ఆరా తీసిన చంద్రబాబు
- గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ ఘటన

4 లో






## బాబు... ది గ్రేట్

- రాజకీయాల్లో ఒక ఐకాన్ చంద్రబాబు
- దార్శనికుడు, నవ్యాంధ్ర నిర్మాతకు సాటి రాలేన్న నేతలు
- తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టి నేటితో 30 ఏళ్లు
- విజనరీ సేవలను గుర్తు చేసుకుంటూ సంబరాలకు పిలుపు
- కేంద్ర, జిల్లా కార్యాలయాల్లో ఫొటో ఎగ్జిబిషన్లకు నిర్ణయం
- ఏపీ పునర్నిర్మాణం బాబుతోనే సాధ్యమన్న ఆలపాటి
- ఆయన ఒక బ్రాండ్ అని కొనియాడిన అశోక్‌బాబు

- వివరాలు 5 లో..

## ప్రతి పేదకూ 'ఎన్టీఆర్ భరోసా'

- హామీకి కట్టుబడి తొలి నెల నుండే రూ.4 వేల పెన్షన్
- మచిలీపట్నంలో సాయంత్రానికి 100 శాతం పంపిణీ పూర్తి
- పంపిణీలో సచివాలయ సిబ్బంది చొరవ అభినందనీయం
- గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర
- భారీ వర్షంలోనూ ఇంటింటికీ తిరిగి పెన్షన్ల పంపిణీ

6 లో



# అంతటా అప్రమత్తం

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో భారీవర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షించారు. ఓర్వకల్లు పర్యటన రద్దు చేసుకుని ఎడతె రపిలేని వర్షాలపై నిరంతరం పర్యవేక్షిస్తూ సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. రాష్ట్రంలో మరో మూడురోజులు భారీ వర్షాలు ఉండే అవకాశం ఉందని, కిందిస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పు డు పరిశీలించాలని సూచించారు.



- ఎడతెరపిలేని వర్షాలపై సీఎం నిరంతర సమీక్ష
- సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు ఆదేశాలు
- రౌండ్ ద క్లాక్ వివరాలు తెలుసుకున్న చంద్రబాబు
- నష్ట నివారణపై దృష్టిపెట్టాలని అధికారులకు ఆదేశాలు
- వివిధ ఘటనల్లో భారీ వర్షాలకు 8 మంది దుర్మరణం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం
- ఉత్తరాంధ్ర కలెక్టర్లకు సన్నద్ధతపై ప్రత్యేక ఆదేశాలు
- హుద్‌హుద్ నివారణ చర్యలు గుర్తుచేసిన సీఎం
- ప్రభావిత జిల్లాలకు తక్షణ సాయానికి నిధుల విడుదల

### తెగిపడిన విద్యుత్ తీగలపై స్పందించాలి

పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై భారీస్థాయిలో నీరు చేరి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందని, పరిస్థితికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాల న్నారు. ప్రజలకు తగు సూచనలు చేస్తూ అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండా లని ఆదేశించారు. మ్యాన్ హోల్స్ దగ్గర, విద్యుత్ తీగలు తెగిపడి ప్రమాదాల జరగకుండా చూడాలని, ఫిర్యాదు వచ్చిన వెంటనే అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు ఉన్న ప్రాంతాల్లో స్కూళ్లకు సెలవు ప్రకటించాలని అదేశించారు.

### వాగుల దగ్గర రాకపోకలు నిలిపివేయాలి

పొంగే వాగులు, వంకల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు, వాగులు దాటేందుకు ప్రజల ను, వాహనాలను అనుమతించరాదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న వంతెనలపై రాకపోకలు నిలిపివేయాలని సూచించారు. ఈ విషయంలో కఠినంగా ఉండాలని తెలిపారు. భారీవర్షా లు ఉన్న ప్రాంతాల ప్రజలకు సెల్‌ఫోన్ మెసేజ్ ద్వారా అలెర్ట్ పంపాలని సూచించారు.

### అవసరమైతే డ్రోన్లను వినియోగించండి

వాట్సాప్ గ్రూపుల ద్వారా వివిధ శాఖల అధికారులు నిత్యం సంప్రదింపులు జరుపుకుని సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు సత్వర సాయం అందుతుంది. క్రైసిస్ మేనేజ్‌మెంట్ విషయంలో డ్రోన్ల వంటి టెక్నాలజీని విరివిగా వాడాలి. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వర్షాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు.

### సహాయక చర్యలకు జిల్లాకు రూ.3 కోట్లు

సహాయ చర్యలకు ఎక్కువ ప్రభావమున్న జిల్లాకు రూ.3 కోట్లు, కాస్త తక్కువ ప్రభావం ఉన్న జిల్లాలకు రూ.2 కోట్లు చొప్పున నిధులు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. భారీ వర్షాల కారణంగా 8 మంది చనిపోయినట్లు వివరించగా బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. వర్షాలు తగ్గే వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రాంతాల్లో నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో అధికారులు తక్షణ చర్యలకు దిగాల్సిన అవసరం ఉంది. పొక్లెయినర్లు పెట్టి నీటి ప్రవాహా లకు ఉన్న అడ్డంకు లను తొలగించి నీరు బయటకు వెళ్లేలా చూడాలని, ఓపెన్ డ్రైన్స్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అలాంటి ప్రాంతాలలో హెచ్చరికలు జారీ చేసి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### తీరం వెంబడి గ్రామాలపై కలెక్టర్లకు అదేశాలు

శ్రీకాకుళం నుంచి విశాఖ మధ్య శనివారం అర్ధరాత్రి తుఫాన్ తీరం దాటుతుందని, ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో తీరం వెంట ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయా లని కలెక్టర్లను ఆదేశించారు. రాత్రి అంతా మేలుకుని అయినా సరే ప్రజల రక్షణ కోసం పనిచేద్దామని తెలిపారు. తుఫాను తీరం దాటే సమయంలో 55 నుంచి 65 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అధికారులు వివరించగా గాలుల వేగంపై స్పష్టమైన అంచనాలతో సన్న ద్ధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సైక్లోన్ షెల్టర్లను సిద్ధం చేసి పునరా వాసం కోసం ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

### దుర్గ గుడిలో ప్రమాదం విచారకరం

బుడమేరులో నీటి ఉధృతి తీవ్రంగా ఉందని, బుడమేరు ఆక్రమణ వల్ల వరద సమయంలో సమస్యలు వస్తున్నాయని మంత్రి కొల్లు రవీంద్ర, అధికారులు వివరించారు. సమస్య పరి ష్కారానికి అవసరమైన ప్రణాళికతో రావాలని సీఎం సూచించారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి పంట కాలువలకు నీటి విడుదల నిలిపివేసినట్లు అధికారులు వివరించారు. విజయవాడ నగరంలో రోడ్లపై నిలిచిన నీటిని బయటకు పంపేందుకు తీసుకుంటున్న చర్యలను వివరిం చారు. కనకదుర్గమ్మ గుడిలో ప్రమాదం విచారకరమని, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొండ ప్రాంతాల్లో ఉన్న వారిని అవసరమై ఖాళీ చేయించాలని సూచించారు. గర్భిణుల వివరాలు సేకరించి...అవసరమైన సాయం అందిం చేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

### ముగ్గురి మృతిపై ఆరా... సెలవు ఇవ్వలేదా అని ప్రశ్న

పెదకాకాని ఉప్పలపాడు వాగులో కారు కొట్టుకుపోయి ముగ్గురు మృతిచెందిన ఘటనపై అధికారులను వివరణ కోరారు. పాఠశాలకు సెలవు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. మధ్యా హ్నం తరువాత సెలవు ప్రకటించి విద్యార్థులను పంపామని చెప్పారు. భారీ వర్షాలు ఉన్న జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని, ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని తెలిపారు. వాతావరణ శాఖ ఇచ్చే సమాచారం ఆధారంగా ముందురోజే సెలవుపై ప్రకటన చేయాలన్నారు. ప్రమాదం జరిగిన తరువాత ప్రభుత్వం సహాయం చేయ డం కాదు....ప్రమాదం జరగకుండా చూడాలని సూచించారు.

### హుద్‌హుద్ చర్యలను అనుసరించాలి

భారీ వర్షాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాను. అధికారులు కూడా వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం తెప్పించుకుని వేగంగా స్పందించాలి. అధికారుల నిర్లక్ష్యం వల్ల చిన్న ఘటన జరిగినా సహించేది లేదు. విపత్తు సమయంలో ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. హుద్ హుద్ తుఫాన్ సమయంలో అనుసరించిన విధానాలను కలెక్టర్లు స్టడీ చేయాలని, నాడు తీసుకున్న ముందస్తు చర్యల ద్వారా ప్రాణనష్టం లేకుండా చేశామని వివరించారు. ఆ విధానాలను అనుసరించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

### కలుషిత ఆహారం ఘటనలపై విచారణ చేపట్టాలి

వర్షాలు, వరదల కారణంగా తాగునీరు, ఆహారం కలుషితమయ్యే అవకాశం ఎక్కువ ఉంది. అల్లూరి జిల్లాలో కలుషిత ఆహారం ఘటన జరిగింది. వీటిపై అధికారులు సీరియస్ గా దృష్టిపెట్టాలి. బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించేలా చర్యలు చేపట్టాలని సూ చించారు. కలుషిత ఆహారం ఘటనలకు గల కారణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల తీవ్రత దృష్ట్యా మరింత సమర్ధవంతంగా పనిచేయా లని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో జ్వరాల బారిన పడిన గిరిజనులకు వైద్యం అందేలా చూడాలని తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టులలో నీటి నిల్వలను నిరంతరం మానిటర్ చేయాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన నిధులు విడుదలకు ఆదేశాలు ఇచ్చాం. ప్రాజెక్టుల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం..అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు.

# కలెక్టర్లూ.. బీ అలెర్ట్!

- నేడు తీరందాటనున్న తుపాను
- కళింగపట్నం వద్ద దాటే అవకాశం
- మోస్తరు, భారీ వర్షాలకు ఛాన్స్
- అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి
- సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వద్దు
- 24 గంటలూ కంట్రోల్ రూంనుంచి పర్యవేక్షణ
- విపత్తుల నిర్వహణ మంత్రి అనిత సూచన
- సీఎస్ సహా ఉన్నతాధికారులు నిరంతర సమీక్ష



అమరావతి (చైతన్య రథం): బంగాళాఖాతంలోని వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో హోం మరియు విపత్తుల నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా, సీసీఎల్‌ఏ చీఫ్ కమిషనర్ జి జయలక్ష్మి, సీఎల్‌ఏ సెక్రటరీ ఎన్ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ కృష్ణతేజ, విపత్తుల సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు.

హోంమంత్రి వంగలపూడి అనిత కలెక్టర్లతో భారీ వర్షాలు/ వరదలపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం వాయుగుండం అర్ధరాత్రి విశాఖపట్నం మరియు గోపాల్‌పూర్ మధ్య కళింగపట్నానికి దగ్గరలో తీరందాటే అవకాశం ఉందన్నారు. ఆదివారం కూడా చాలాచోట్ల మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విపత్తుల సంస్థలోని స్టేట్ కంట్రోల్ రూమ్‌నుంచి అధికారులతో కలసి ఎప్పటికప్పుడు వర్షాభావ పరిస్థితులు, వాగులు, కాలువలు, రోడ్లమీద వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ సంబంధిత జిల్లాల కలెక్టర్లకు సూచనలు జారీ చేశారు. సహాయక చర్యల్లో నిర్లక్ష్యం లేకుండా వ్యవహరించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు పవర్ రిస్టోరేషన్ సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, హెల్త్, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రాణనష్టం జరగకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్స్, పడిన చెట్లు వెంటనే తొలగించాలన్నారు. ప్రభావిత మండలాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలించాలని అలాగే ప్రజలు సహాయక చర్యల్లో అధికారులకు సహకరించాలని కోరారు. రానున్న రెండు రోజులు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పొంగిపొర్లే రోడ్లు, కాలువలు, కల్వర్టులు, మ్యాన్‌హోల్స్‌కు, పడిపోయిన విద్యుత్ లైన్లకు, స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. వాగులు, కాల్వలు దాటే ప్రయత్నం చేయొద్దని కోరారు. రోడ్లమీద వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున పూర్తిస్థాయిలో తగ్గేవరకు రోడ్ల మీదకు రాకుండా సహకరించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, విద్యుత్, హెల్త్ అండ్ మెడికల్, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ, మత్స్య, సివిల్ సప్లయిస్ ఇతర శాఖలతో సమన్వయ పర్చుకుని జిల్లాల్లో క్షేత్రస్థాయిలో సహాయక చర్యలకు ఎటువంటి అటంకం లేకుండా చూడాలన్నారు. అత్యవసర సహాయక చర్యల్లో 4 ఎన్డీఆర్ఎఫ్, 6 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నట్లు తెలిపారు. గోదావరి, కృష్ణా, తుంగభద్ర ఇతర నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు విపత్తుల నిర్వహణ సంస్థ సమాచారాన్ని గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 1070, 112, 18004250101ను సంప్రదించాలన్నారు.

చైతన్యరథం

# ప్రజలూ.. అప్రమత్తం!

- తుపాను వర్షాలపై మంత్రి లోకేష్ పిలుపు
- మంగళగిరిపై గంటగంటకూ సమీక్ష
- సహాయక చర్యలపై అధికారులకు ఆదేశాలు
- ముంపు పరిస్థితిని చక్కదిద్దిన లోకేష్



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఐటీ, విద్యామంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం, విపత్తు నిర్వహణ శాఖ అలెర్ట్ మెసేజ్‌లు గమనిస్తూ తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు బయటకు రావొద్దని, కొండ చరియలు విరిగిపడే, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికార యంత్రాంగం సూచించిన సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు అధికారిక సహాయక చర్యలకు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. విపత్తుల కష్ట సమయంలో తెలుగుదేశం పార్టీ ప్రజలకు అండగా ఉంటుందనే భరోసా కల్పించాలని మంత్రి లోకేష్ సూచించారు.

### మంగళగిరిపై గంటగంటకూ సమీక్ష

విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో మంగళగిరిలో వరద సహాయక చర్యలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. టీడీపీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ద్వారా గంటగంటకూ పరిస్థితిని సమీక్షించిన మంత్రి.. ముంపు ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. మంత్రి ఆదేశాలతో వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు సరఫరా చేశారు. స్థానిక నాయకుల ద్వారా తాడేపల్లి నులకపేట క్వారీ ఏరియాలో భోజనాలు పంపిణీ చేయించారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. డోలాస్ నగర్‌లో రోడ్డుపై అడ్డంగా చెట్లు పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న వెంటనే చెట్లు తొలగించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో రోడ్డుపై పడిన చెట్లను సిబ్బంది తొలగించారు. ఆత్మకూరు గ్రామంలో కాలువ కట్ట తెగి నిర్వాసితులైన దాదాపుగా వందమందికి ఆత్మకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతో పాటు నియోజకవర్గంలోని మరికొన్ని పాఠశాలల్లో ఆశ్రయం కల్పించారు. వారికి అవసరమైన ఆహారాన్ని టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది అందించారు. నవులూరులో పోతురాజు చెరువునిండి కట్టపై నుంచి నీరుపారడంతో.. పగిలిన తూములను తొలగించి నీరు సులభంగా బయటకు పోయేలా చర్యలు చేపట్టారు. బకింగ్‌హాం కెనాల్‌కు పెద్ద ఎత్తున చేరిన వరద నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేశారు. టిడ్కో గృహ సముదాయాల్లోకి పెద్దఎత్తున వరదనీరు చేరడంతో క్రేన్లు వినియోగించి వరదనీటిని మళ్లించారు. కొత్తపేటలో కొండచరియలు విరిగిపడి మృతి చెందిన నాగరత్నమ్మకు మంత్రి నారా లోకేష్ చొరవతో సీఎం చంద్రబాబు రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. 46 ఏళ్ల తర్వాత మంగళగిరిలో ఇంతటి భారీగా వర్షాలు కురిశాయి. మంత్రి నారా లోకేష్ ముందస్తు చర్యలు చేపట్టి బాధితులకు అండగా నిలిచారు. వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, తాగునీరు అందిస్తూ సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా పార్టీ శ్రేణులను కోరారు. తుపాను తీవ్రరూపం దాల్చుతున్నందున అధికారులంతా 24/7 అందుబాటులో ఉండాలని, అవసరాన్ని బట్టి పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## కొండచరియలు విరిగిపడిన ఘటనలో...

# మృతుల కుటుంబాలకు పరిహారం

### ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

అమరావతి(చైతన్యరథం): భారీ వర్షాలకు విజయవాడలోని మొగల్రాజపురంలో ఇళ్లపై కొండచరియలు విరిగి పడ్డాయి. ఈ ఘటనలో నలుగురు మృతి చెందడంపై సీఎం నారా చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బండరాళు విరిగి ఇళ్లపై పడిన ఘటనలో మేఘన, బోలెం లక్ష్మీ, లాలు, అన్నపూర్ణ అనే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. సహాయక చర్యలపై అధికారులతో సీఎం మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉన్న చోట నుంచి స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించే అంశంపై చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రెండు మూడురోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అటు ప్రజలు, ఇటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారుల సూచనలను ప్రజలు తప్పక పాటించాలని కోరారు.



# నూజివీడు ట్రిపుల్ ఐటీలో మంత్రి ఆకస్మిక తనిఖీలు

నూజివీడు(చైతన్యరథం): రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు కళాశాల ప్రాంగణంలో కలియ తిరిగి అక్కడ పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. వంటశాల, తాగునీటి సౌకర్యం, విద్యార్థులకు పెడుతున్న అల్పాహారం రుచి చూశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలిగించవద్దని, రుచికరమైన ఆహారాన్ని అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.





# ఆ ఘటన దురదృష్టకరం: పవన్

### ఉప ముఖ్యమంత్రి పవన్ విచారం



అమరావతి (చైతన్య రథం): విజయవాడలో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో నలుగురు మృతి చెందడం దురదృష్టకర ఘటనగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియ చేస్తూ.. గాయపడినవారికి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలందిస్తుందన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల మూలంగా మృతుల సంఖ్య ఎనిమిదికి చేరినట్టు అధికారులు తెలిపారని అంటూ.. ప్రకృతి విపత్కర సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించే ఏర్పాటు చేసిందన్నారు. అధికారులు లోతట్టు ప్రాంతాలవారిని తరలించే ఏర్పాట్లు చేస్తున్నారని, వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో అధికారులకు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, శ్రేణులు సాయంగా ఉండాలన్నారు. ఆహారం, రక్షిత తాగునీరు, వైద్య సాయం అందించడంలో తోడ్పాటు అందించాలన్నారు.

# సహాయక చర్యలకు ప్రత్యేక బలగాలు: హోంమంత్రి అనిత



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో భారీ వర్షాలపై హోం, విపత్తు నిర్వహణ శాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల కలెక్టర్లతో హోంమంత్రి వంగలపూడి అనిత టెలీ సమీక్ష నిర్వహించారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని ప్రత్యేక బలగాలకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. విజయవాడలో కొండచరియలు విరిగిపడి నలుగురు మృతి చెందడంపై మంత్రి విచారం వ్యక్తం చేశారు.

### భారీ వర్షాలపై మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష

భారీ వర్షాలపై ప్రజల్ని అప్రమత్తం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. విజయవాడలో పలు ప్రాంతాలు నీటమునగడంపై ఆరా తీశారు. నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో నీరు పారేలా అడ్డంకులు తొలగించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మ్యాన్ హోల్స్, విద్యుత్ స్తంభాల విషయంలో అప్రమత్తం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులంతా అందుబాటులోనే ఉన్నారని, వర్ష ప్రభావం తగ్గే వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వారితో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు.

# గుంటూరు జిల్లాలో విషాదం

### వాగులో కొట్టుకుపోయి ముగ్గురి మృతి

పెదకాకాని: గుంటూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పెదకాకాని మండలం ఉప్పలపాడు సమీపంలోని వాగులో కారు కొట్టుకుపోయింది. ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. నంబూరులోని పాఠశాలలో ఉప్పలపాడుకు చెందిన రాఘవేంద్ర విధులు నిర్వహిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా శనివారం ఉదయం పాఠశాల యాజమాన్యం సెలవు ప్రకటించింది. దీంతో అదే పాఠశాలకు వెళ్లిన ఉప్పలపాడుకు చెందిన ఇద్దరు విద్యార్థులను తీసుకొని రాఘవేంద్ర స్వగ్రామానికి బయల్దేరాడు. ముగుగు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నా ఆగకుండా వెళ్లడంతో వరద ఉధృతికి కారు కొట్టుకుపోయింది. ఘటనలో రాఘవేంద్రతోపాటు కారులో ఉన్న విద్యార్థులు సాత్విక్, మానిక్‌లు మృతిచెందారు. స్థానికుల సాయంతో కారుతోపాటు వాగులో కొట్టుకుపోయిన మృతదేహాలను బయటకు తీశారు.

### మంత్రి లోకేష్ విచారం

కుండపోత వర్షాలతో గుంటూరు ఛానల్ తెగిపోయి వరద ఉధృతికి కారు కొట్టుకుపోయిన సంఘటనలో ముగ్గురు మృతి చెందిన ఘటనపై మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉప్పలపాడు కాలవలో పడి ఎర్రబాలెంకు చెందిన టీచర్ రాఘవేంద్రరావు, ఉప్పలపాడుకు చెందిన విద్యార్థులు దుర్మరణం చెందారన్న సమాచారంతో లోకేష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.



# భిన్నకోణాల్లో విచారణ



- ఏ అంశాన్నీ తేలికగా తీసుకోవద్దు
- విద్యార్థినులకు పూర్తి ధైర్యమివ్వాలి
- ఆడబిడ్డల రక్షణ విషయంలో రాజీ లేదు
- సైబర్ నిపుణులతోనూ లోతైన దర్యాప్తు
- నిందితులెవరైనా ఉపేక్షించేది లేదు..
- విచారణ కమిటీతో ముఖ్యమంత్రి సమీక్ష
- వివరాలపై ఆరా తీసిన చంద్రబాబు
- గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ ఘటన

అమరావతి (చైతన్య రథం): కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ వ్యవహారంపై సాగుతోన్న విచారణను ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. హిడెన్ కెమేరాలు పెట్టారనే అంశంపై జరుగుతోన్న విచారణ సారాంశాన్ని టెలీకాన్ఫరెన్స్ ద్వారా తెలుసుకున్నారు. ఘటన వెలుగు చూసిన తరువాత ఎస్పీ, కలెక్టర్‌ను శుక్రవారం కళాశాలకు పంపిన ముఖ్యమంత్రి... అప్పటినుంచీ విచారణ వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. వందలాది విద్యార్థినులకు సంబంధించిన అంశం కావడంతో ఘటనను సీఎం సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై కేసు రిజిస్టరైన అనంతరం జరుగుతున్న విచారణపై సీఎం రివ్యూ చేశారు. ఇప్పటివరకు విచారణలో సాధించిన పురోగతిపై అధికారులతో చర్చించారు. విద్యార్థినులు చెప్పే అంశాల ఆధారంగా లోతుగా, అన్ని కోణాల్లో విచారణ జరపాలన్నారు. ఇప్పటివరకు జరిపిన పరిశీలనలో హిడెన్ కెమేరాలు ఏవీ దొరకలేదని అధికారులు చెప్పగా... మరింత లోతుగా విచారణ జరపాలన్నారు. అనుమానితుల ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లను సైబర్ నిపుణుల ద్వారా పరిశీలించాలన్నారు. డాటా తొలగించే అవకాశాన్ని కూడా పరిగణలోకి తీసుకుని టెక్నికల్‌గా ఉన్న అన్ని వనరులను ఉపయోగించుకోవాలన్నారు. ఆడబిడ్డల భద్రత, మహిళల వ్యక్తిగత గోప్యత విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా సైబర్ సెక్యూరిటీ నిపుణుల ఆధ్వర్యంలో డీ బగ్గింగ్ డివైసెస్‌తో అన్నిచోట్లా తనిఖీలు చేపట్టే విషయాన్ని పరిశీలించాలని ఆదేశించారు.

నేరం జరిగిందా? లేదా? అనేది పూర్తి విచారణ తరువాతనే తేలుతుందని.... తప్పు జరిగిందని తేలితే మాత్రం నిందితులను వదలేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో విద్యార్థినుల మనోభావాలను గౌరవించాలని సీఎం సూచించారు. వారి ఆవేదన అర్థం చేసుకుని విచారణ చేపట్టాలని సూచించారు. చదువుకునే ఆడబిడ్డలకు ఇలాంటి వివాదం తలెత్తితే మానసికంగా తీవ్ర ఆందోళన చెందుతారని... వారికి, వారి తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఎవరి దగ్గరైనా ఘటనకు సంబంధించి అదనపు సమాచారం, ఆధారాలు ఉంటే నేరుగా తనకే పంపాలని సీఎం కోరారు. ఇదే సమయంలో కొందరు ఈ ఘటనను ఆధారంగా చేసుకుని విద్యార్థులను మరింత భయపెట్టేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని.... అలాంటి వారి చర్యలను అడ్డుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. సున్నితమైన అంశాల విషయంలో తప్పుడు ప్రచారం మరింత నష్టం చేస్తుందని సీఎం అన్నారు. ఎప్పటికప్పుడు విచారణ వివరాలు తనకు చెప్పాలని.... ఘటనలో తప్పు ఉందని తేలితే మాత్రం ఎవరినీ ఉపేక్షించేది ఉండదని సీఎం స్పష్టం చేశారు. తిరిగి విద్యార్థినులు ప్రశాంతంగా చదువు కొనసాగించే పరిస్థితి కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## విద్యార్థులకు అస్వస్థతపై మంత్రి లోకేష్ సీరియస్



- నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ తొలగింపు
- ముగ్గురు సభ్యులతో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు
- ఫిర్యాదుల పరిష్కారానికి కార్యాచరణకు ఆదేశం

అమరావతి(చైతన్యరథం): ఇటీవల నూజివీడులో కలుషితాహారం తిని పెద్దఎత్తున విద్యార్థులు అనారోగ్యానికి గురైన ఘటనను రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సీరియస్‌గా తీసుకున్నారు. విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భరోసా కల్పించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ పర్యవేక్షణ కోసం త్రిసభ్య కమిటీని నియమించారు. ఇందులో కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యాశాఖ ఇన్‌చార్జ్ ఛైర్మన్ రామ్మోహన్ రావు, ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి సభ్యులుగా ఉంటారు.

### పర్యవేక్షణ కమిటీ తీసుకునే చర్యలు

విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత నిర్వహణ కోసం ప్రామాణిక ఆపరేటింగ్ ప్రోటోకాల్ పాటిస్తుంది. పారిశుద్ధ్యం, మెస్ పరిశుభ్రత నిర్వహణ, నాణ్యతా ప్రమాణాల అమలుకు చర్యలు తీసుకుంటుంది. నూజివీడు ట్రిపుల్ ఐటీలో అవసరాలకు అనుగుణంగా చిన్నచిన్న మరమ్మతులు చేస్తారు. లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదుల పరిష్కారాని కి అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసి వేగంగా విచారణ చేసి చర్యలు తీసుకుంటారు. ప్రతి డిపార్ట్‌మెంట్ స్థాయిలో తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం ద్వారా డ్రగ్ ఫ్రీ, పొగాకు రహిత సంస్థల కోసం కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తారు. ప్రతి విద్యార్థి విషయంలో మానసిక ఒత్తిడి తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవన నైపుణ్యానికి కాలేజ్ వెల్‌నెస్ టీమ్‌ను ఏర్పాటు చేస్తారు. ఇందులో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ లేదా తత్సమానం, ఇద్దరు సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు (స్త్రీ ప్రాధాన్యం), ప్రతి విభాగం నుంచి విద్యార్థి మానిటర్లు, తల్లిదండ్రుల సంఘం ప్రతినిధులు ఉంటారు. సంస్థ యొక్క ప్రధాన పర్యవేక్షకు లు, కౌన్సెలర్లు / మెడికల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో హాని కలిగించే విద్యార్థుల చుట్టూ భద్రతా వలయం ఏర్పాటు చేసి డేగకన్నేసి ఉంచుతారు.

### కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

ఆహార నాణ్యత, చిన్నచిన్న మరమ్మతులు, కొన్ని సున్నితమైన అంశాలు, వైద్య పర్యవేక్ష ణపై ఫిర్యాదులు వంటి సమస్యల తక్షణ పరిష్కారానికి నిర్దిష్ట సమయంతో కూడిన కార్యా చరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణ కమిటీకి సూచించా రు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే కమిటీ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని వివరించారు.

## ప్రజారోగ్యంపై అప్రమత్తం

- వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఆదేశం
- ఉన్నతస్థాయి అధికారులతో సమీక్ష



అమరావతి (చైతన్యరథం): తుపాను కారణంగా రాష్ట్రంలో ఎడతెరిపిలేని వర్షాల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమవ్వాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు మరికొద్ది రోజులు కొనసాగే పరిస్థితులు ఉన్నాయన్న నేపథ్యంలో.. ప్రజల ఆరోగ్యంపట్ల అన్ని స్థాయిల అధికార్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. అమెరికాలో ఉన్న మంత్రి వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, ఇతర అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. క్షేత్రస్థాయి వైద్యాధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు తగు సూచనలు, సాయంఅందేలా చూడాలని ఆదేశించారు. భారీగా వర్షాలు కురుస్తున్నందున గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా సంబంధిత శాఖలతో ఆరోగ్య శాఖాధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.

గుంటూరు, రంగరాయ, సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థుల ద్వైవార్షిక సమావేశంలో కీలకోపాన్యాసం చేయడానికి నిర్వాహకుల ఆహ్వానంపై మంత్రి అమెరికాలోని ఆర్లెండో చేరుకున్నారు. సెప్టెంబర్ 1న సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులు, ఇతరులతో నిర్వహిస్తోన్న కార్యక్రమంలో రాష్ట్రంలోని వైద్య ఆరోగ్యరంగంలో కొత్తగా రానున్న పెట్టుబడుల అవకాశాల్ని మంత్రి వివరించనున్నారు.

## అత్యవసరమైతేనే ప్రజలు బయటకురావాలి

- వర్షాలపై విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- బాపట్ల జిల్లాలో పరిస్థితిపై కలెక్టర్‌తో సమీక్ష

అమరావతి(చైతన్యరథం): ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రమాదాల నివారణపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు అవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కోరారు. విద్యుత్ తీగలు తెగిపడినా, కిందకు జారిన వెంటనే సమీప అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. తాకడం, పక్కకు నెట్టడం లాంటి పనులు చేయవద్దని కోరారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపైన అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు సీఎంతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మంత్రి బాపట్ల జిల్లాలో పరిస్థితిని వివరించారు. సీఎం సూచనలతో జిల్లా కలెక్టర్‌ను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలను తరలించేలా చర్యలు తీసు కోవాలని సూచించారు. బాపట్ల జిల్లాలో



జరుగుతున్న పెన్షన్ల పంపిణీపైనా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల పంపిణీ విషయంలో సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం వెసులు బాటు కల్పించిందని, వచ్చే రెండు మూడురోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తి చేయవచ్చని తెలిపారు.

## రేపటి నుంచి అర్జీల స్వీకరణకు షెడ్యూల్ విడుదల

**అందుబాటులో ఉండనున్న మంత్రులు, నాయకులు**

మంగళగిరి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలనుసారం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి సెప్టెంబరు 2 నుంచి 14వ తేదీ వరకు అందుబాటులో ఉండే మంత్రులు, నాయకుల జాబితాను శనివారం పార్టీ కార్యాలయం ప్రకటించింది. ప్రజల నుంచి ప్రతిరోజూ రాష్ట్ర మంత్రులు, జాతీయ నాయకులు అర్జీలు స్వీకరిస్తారు. ప్రజలకు, పార్టీ శ్రేణులకు నాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ నెల 2న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, 3న హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, 4న నీటి పారుదల మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, 5న సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, టీడీపీ జాతీయ ప్రధాన కార్య దర్శి కె.ఎస్.జవహర్, 6న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, 7న వినాయక చవితి సెలవు దినం, 9న రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, 10న మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, 11న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు పనబాక లక్ష్మి, 12న గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, 13న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్, గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, 14న ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్ అర్జీలు స్వీకరిస్తారు.

చైతన్యరథం

# రాజకీయాల్లో ఒక ఐకాన్ చంద్రబాబు

- దార్శనికుడు, నవ్యాంధ్ర నిర్మాతకు సాటి రాలేన్న నేతలు
- తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టి నేటితో 30 ఏళ్లు
- విజనరీ సేవలను గుర్తు చేసుకుంటూ సంబరాలకు పిలుపు
- కేంద్ర, జిల్లా కార్యాలయాల్లో ఫొటో ఎగ్జిబిషన్లకు నిర్ణయం
- ఏపీ పునర్నిర్మాణం బాబుతోనే సాధ్యమన్న ఆలపాటి
- ఆయన ఒక బ్రాండ్ అని కొనియాడిన అశోక్‌బాబు







మంగళగిరి(చైతన్యరథం): చంద్రబాబు మొదటిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి సెప్టెంబరు 1 నాటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతలు సం బరాలకు పిలుపునిచ్చారు. ఆయన సేవలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఫొటో ఎగ్జిబిషన్లు, పలు సేవా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మం గళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో నేతలు చంద్రబాబు సేవలను గుర్తు చేసుకుంటూ తమ అను భవనాలను పంచుకున్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్‌లు పాల్గొన్నారు.

### విజన్ ఉన్న నేత: ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 1995 సెప్టెంబరు 1 యావత్ తెలుగుజాతి గర్వించదగిన రోజు. సీఎంగా చంద్రబాబు తొలిసారి ప్రమాణ స్వీకారం చేసిన రోజు అది. నాటి నుంచి అహర్నిశలు తెలుగు జాతి ఉన్నతి కోసం శ్రమించిన మహోన్నత నాయకుడు చంద్రబాబు జీవితం తెరిచిన పుస్తకం. మచ్చలేని చంద్రుడు. తొలిసారి సీఎంగా ప్రమాణ స్వీకా రం చేసి 30ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తు న్నామని వివరించారు. చంద్రబాబు లాంటి నాయకుడు రాష్ట్ర ప్రజలకు దొరకడం అదృష్టమని, తెలుగు ప్రజల ఖ్యాతిని ఉన్నత స్థానంలో ఉంచడమే ఆయన లక్ష్యమ ని పేర్కొన్నారు. విజన్ ఉన్న నాయకుడు బాబు అమలు చేసిన విధానాలను నేడు అనేక రాష్ట్రాలు అనుసరిస్తు న్నాయని, నవ్యాంధ్ర నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రాజకీయాల్లో అపరచాణిక్యుడిగా అభి వృద్ధిలో తిరుగులేని వ్యక్తిగా ఎందరో గొప్ప వ్యక్తుల ప్రశంసలు పొందారు. బిల్ గేట్స్, బిల్ క్లింటన్, సుందర్ పిచాయ్, చంద్రశేఖరన్ లాంటి వ్యక్తులు ప్రశంసించా రంటే సమాజం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, ముందు చూపు ఏ పాటిదో అర్థం అవుతుందన్నారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడితే.. తెలుగు ప్రజ లకు ఆత్మవిశ్వాసాన్ని పెంచిన వ్యక్తి చంద్రబాబు. మహి ళాసాధికారత అనే పదానికి అర్థం పరమార్థం చెప్పిన ఏకైక వ్యక్తి. సంక్షేమ పథకాలతో సామాజిక మార్పు తీసుకు వచ్చిన అనితర సాధ్యుడు అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీల లాగే బీసీలకు కూడా సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషిన వ్యక్తి. సామాజిక మార్పుకు సంకేతంగా దళితుల అభ్యున్నతికి తొలి అడుగు వేసిన వ్యక్తి. అన్ని వర్గాలకు న్యాయం చేసిన మహనీయుడు. వ్యవసాయ రాష్ట్రాన్ని పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దిన దార్శనికుడు. నేడు రాజధానుల్లో మేలైన రాజధాని ఏదని చెప్పుకోవాంటే అందరూ హైదరాబాద్‌నే చూపి స్తున్నారంటే ఆ ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. నాడు చంద్రబాబు విజనరీ థింకింగ్ వలనే సైబరాబాద్ సాధ్యమైందని గుర్తుచేశారు. గతంలో ఉద్యోగాల కోసం చెన్నై, బాంబే, బెంగళూరులకు వెళ్లేవారు నేడు హైదరా బాద్ వెళుతున్నారు. అది చంద్రబాబు ముందుచూపు తోనే సాధ్యమైం దన్నారు. ఏ నిర్ణయాలు తీసుకుంటే సమాజంలో మార్పువస్తుందో ఆమార్పుతోవికాస వంత మైన సమాజానికి మానవ వనరులను ఎలా పెంపొం దించుకోవచ్చో తెలిసిన విజనరీ నాయకుడు. ఎక్కడైతే మానవ వనరులు అభివృద్ధి చెందాయో... ఆ రాష్ట్రం, ఆ దేశం అభివృద్ధి చెందుతుందని బలంగా నమ్మిన వ్యక్తి. సాంకేతిక అభివృద్ధికి నాంది పలికింది ఆయనే. బాబు వేసిన పునాదులే ఈ రోజు తెలంగాణకు మంచి ఫలాలను అందిస్తుంది. ఎన్ని ఇబ్బందులు ఎదురొచ్చినా ఆత్మవిశ్వాసంతో నిలబడటం ఆయన నైజం. కష్టాలను అవకా శాలుగా మలుచుకుని విజయం దిశగా అడుగు లు వేస్తారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్ర దేశ్‌గా మారుస్తారు. చంద్రబాబు పేరు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. నాడు కేవలం ఐదువేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే రాష్ట్రంలో నేడు 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందంటే చంద్రబాబు వలనే అది సాధ్యమైంది. పోలవరం ప్రాజెక్ట్‌కు ప్రతి సోమవారం కేటాయించి డయాఫ్రం వాల్ కడితే దాన్ని జగన్ పూర్తి కూల్చేశాడు. పోలవరం అనే జీవనాడిని ప్రజలకు అందించాలని బాబు ప్రతినిత్యం తపన పడుతున్నాడు.

### రాజకీయాల్లో అరుదైన వ్యక్తి: అశోక్‌బాబు

పరుచూరి అశోక్‌బాబు మాట్లాడుతూ చంద్రబాబు జీవితంలో 2019 ముందు రాజకీ యాలు ఒక రకంగా ఆ తర్వాత రాజకీయాలు మరో రకంగా ఉన్నాయి. చంద్రబాబు చేయని తప్పుకు ఆయనను జైలుకు పంపారు. ఇంటిపై దాడి చేశారు. హెరిటేజ్‌పై కక్ష సాధింపులకు దిగారు. అయినా భయపడలేదు. చంద్రబాబు అంటేనే విజనరీ నాయకుడు, నిజాయతీ కలిగిన వ్యక్తి, హార్డ్ వర్కర్.. ఈ మూడు అంశాలు ఒకే వ్యక్తిలో ఉండటం రాజ కీయాల్లో అరుదు. జాతీయ రాజకీయాల్లో గొప్ప అవకాశాలు వచ్చినా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇక్కడే ఉన్నారు. ఆయన విజన్‌తో రోజుకు 18 గంటలు కష్టపడ్డారు అనేక అక్రమ కేసులు పెట్టినా ఒక్కటి కూడా నిలబడలేదు. ఏ నిర్ణయం తీసుకున్నా సమాజాభివృద్ధి కోసమే తీసుకున్నారు. ఆయన విజన్‌కు పవర్ ప్లాంట్లే నిదర్శనం.. తన పవర్ పోయినా రాష్ట్రానికి పవర్ ఉంటుందని ఆయన చెప్పడం చాలా గొప్ప విషయం. చంద్రబాబు దూరదృష్టితోనే రాష్ట్రంలో ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన ఎప్పుడూ గెలుపు ఓటములపై ఆలోచించలేదు. నాడు కంప్యూటర్లు కూడు పెడతాయా అన్న రాజకీయ నాయకులు అనేక మంది ఉన్నారు. నేడు హైదరాబాద్ ఐటీ హబ్‌గా మారి లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. దూరదృష్టి కలిగిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ అదృష్టమ ని ఎంతోమంది రాజకీయ ఉద్దండులు అంటున్నారు. చంద్రబాబు తన కోసం తాను ఏమీ చేసుకోలేదు. అందుకే జైల్లో పెడితే ప్రపంచంలో ఉన్న తెలుగువారు ఏకమయ్యారు. ముక్తకంఠంతో ఖండించారు. అదే ఆయన గొప్పతనానికి నిదర్శనం. ఆయన జీవిత కాలం ముఖ్యమంత్రిగా ఉండాలని మేము కోరుకుంటున్నామని ఆకాంక్షించారు. 2019లో ప్రజలు మోసపోయి జగన్‌కు ఓట్లు వేశారు. నేడు చంద్రబాబుపై నమ్మకంతో ఓట్లు వేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెడతారు. ప్రజలు కోరుకునే విధంగా ఏపీ నెంబర్‌వన్‌గా ఉండాలనే కల నేరవేరే విధంగా ఆయన పాలన సాగిస్తారు. సహనానికి చంద్రబాబు నిలువుటద్దం. ఆయన ఒక వ్యక్తి కాదు ఆయన ఒక బ్రాండ్. ప్రజల కోసం పాటుబడిన చంద్రబాబు జీవిత అంశాలపై ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు.

### సంక్షేమ సారథి చంద్రబాబు

బుచ్చిరాంప్రసాద్ మాట్లాడుతూ ఒక ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా ఉంటూ రాష్ట్ర ప్రజలకు సేవ చేసే భాగ్యం చంద్రబాబుకు ఇచ్చారు. నాడు రామారావు రూ.30తో పింఛన్‌ను స్టార్ట్ చేస్తే నేడు రూ. 4,000లకు చంద్రబాబు తీసుకెళ్లారు. దాంట్లో చంద్రబాబు పెంచినదే రూ.3,200 ఉంది. సంక్షేమానికి ఎంత పెద్దపీట వేశారో ఇదే నిదర్శనం. రామారావు తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం పోరాడితే.. చంద్రబాబు తెలుగు విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని కల్పించారు. ఆత్మ విశ్వాసంతో ఎంతో కష్టపడి నేడు అన్ని రంగాల్లో యువ త ముందుకెళు తున్నారు. విదేశాల్లో సైతం సత్తా చాటుతున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా వైద్య శిబిరాలు పెట్టి 19 లక్షల మందికి వైద్యసేవలు అందించారు. ప్రతిపక్షంలో కూడా సేవలు కొనసాగిస్తున్నారు. సేవంటే ఎన్టీఆర్, చంద్రబాబులే కనిపిస్తారు తప్ప ఇంకొకరు కనిపించ రని ఉద్ఘాటించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేశారని, బ్రాహ్మణుల కోసం పాటుబడిన పార్టీ టీడీపీ మాత్రమేనని వ్యాఖ్యానించారు.

---

## వైసీపీ నిర్లక్ష్యమే వసతి గృహాలకు శాపం

**- సాంఘిక సంక్షేమ మంత్రి డోలా ఆగ్రహం - చీమకుర్తి ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ**

**- డ్యూటీలోలేని సిబ్బందికి షోకాజ్ నోటీసులు**

అమరావతి (చైతన్య రథం): గత ప్రభుత్వం రాష్ట్రంలోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను నిర్లక్ష్యంచేసిందని రాష్ట్రసాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు.శనివారం ప్రకాశం జిల్లా చీమకుర్తి ఎస్సీ బాలుర హాస్టల్ ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో విధుల్లోలేని సిబ్బందికి షోకాజ్ జారీ చేయాలని ఆదేశించారు. వర్షంలో తడుస్తూనే హాస్టల్‌లోని మరుగుదొడ్లు, పరిసరాల ను మంత్రి పరిశీలించారు. అధ్వానంగావున్న మరుగుదొడ్లు, అపరిశుభ్రతపై మంత్రి ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు ఈ దుస్థితి దాపురించింది. జగన్ కనీసం వసతి గృహాలకు మెయింటినెన్స్ నిధులు కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. జగన్ అధికారం పోయాక ప్రజలపై లేని ప్రేమను వొలకబోస్తున్నారని దుయ్యబట్టా రు.గుడ్లవల్లేరు ఇంజనీరింగ్‌కాలేజీ ఘటన వెనుక వైసీపీ కుట్ర ఉందని, తప్పుడు ప్రచారాలు చేయడం, ఎదుటివారిపై బుర ద చల్లడం వైసీపీకి దినచర్యగా మారిం దని డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు.



గుడ్లవల్లేరు ఘటనపై

## పూర్తిస్థాయిలో దర్యాప్తు

విజయవాడ(చైతన్యరథం): గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తు న్నట్లు కృష్ణా జిల్లా ఎస్పీ తెలిపారు. బాలికల హాస్టల్‌లో ఎలాంటి రహస్య కెమెరాలు దొరకలేదని చెప్పారు. పోలీసులు శనివారం నిందితుల ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను విద్యార్థులు, కాలేజీ సిబ్బంది ఎదురుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులు ఆరోపణలు చేస్తున్న అంశాలకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. ఈ ఘటనపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తదుపరి విచారణ పురోగతిలో ఉందని, ఈ నేరంలో తప్పు చేసిన వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ప్రకాశం బ్యారేజీ 70 గేట్లు ఎత్తివేత

ఏపీలో భారీ వర్షాలు కుదిపేస్తున్నాయి. ఈక్రమంలో ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రస్తుతం బ్యారేజీకి 3.24 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు మొత్తం 70 గేట్లు ఎత్తి 3.2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నుంచి కాల్వలకు 3,507 క్యూసెక్కులు విడుదల చేశారు.





# అక్టోబరు నుంచి కొత్త పెన్షన్లు

**అనర్హులను తొలగించేందుకు చర్యలు**
**స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**

అనకాపల్లి (చైతన్యరథం): నర్సీపట్నం మండలం ధర్మసాగరంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ల పెంపు అమలవుతుందని తెలిపారు. సెప్టెంబరు 1న ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పంపిణీ చేసేలా సీఎం ఆదేశించినట్టు చెప్పారు. ఉదయం 9.30 గంటలకే 80 శాతం పంపిణీ పూర్తయిందని తెలిపారు. కొత్తగా అర్హులైన వారికి అక్టోబరు నుంచి పింఛన్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అనర్హులైన వారిని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, డ్వాక్రా గ్రూపు మహిళలందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 2న పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి గ్రామంలో శుభ్రం చేసే కార్యక్రమం జరుగుతుందని వివరించారు. టీడీపీ, జనసేన నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## భారీ వర్షాలున్న చోట
# ఒకట్రెండు రోజుల్లో పెన్షన్లు

**- సీఎం చంద్రబాబు వెసులుబాటు**
**- టార్గెట్ పెట్టొద్దని కలెక్టర్లకు ఆదేశాలు**



అమరావతి(చైతన్యరథం): భారీ వర్షాలున్న ప్రాంతాల్లో పెన్షన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వెసులుబాటు కల్పించారు. ఇబ్బందులుంటే వచ్చే ఒకట్రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేయవచ్చని సూచించారు. పెన్షన్ పంపిణీ విషయంలో సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావద్దని, టార్గెట్ పెట్టవద్దని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు లేని ప్రాంతాల్లో యథావిధిగా పెన్షన్లు పంపిణీ పూర్తి చేయాలని సూచించారు.

# అర్హులైన ప్రతి పేదకూ 'ఎన్టీఆర్ భరోసా'

- హామీకి కట్టుబడి తొలి నెల నుండే రూ.4 వేల పెన్షన్
- మచిలీపట్నంలో సాయంత్రానికి 100 శాతం పంపిణీ పూర్తి
- పంపిణీలో సచివాలయ సిబ్బంది చొరవ అభినందనీయం
- గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర
- భారీ వర్షంలోనూ ఇంటింటికీ తిరిగి పెన్షన్ల పంపిణీ



మచిలీపట్నం(చైతన్యరథం): పేదలకు ఆర్థికంగా భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకువెళుతుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని గిలకలదిండి, బుద్దాలపాలెం గ్రామాల్లోని లబ్ధిదారులకు భారీ వర్షంలోనూ ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయా కుటుంబాల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్లను ప్రారంభించిందే తెలుగుదేశం ప్రభుత్వమని, ఎన్టీఆర్ రూ.30తో పెన్షన్లు ప్రారంభిస్తే.. చంద్రబాబు రూ.75 చేశారన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ముక్కీ మూలిగి రూ.200 చేస్తే.. తిరిగి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏకంగా రూ.2000 చేసినట్టు చెప్పారు. రూ.3000 చేస్తానని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విడతల వారీ పెంపు పేరుతో పెన్షన్‌దారులను దగాచేశాడు. ఒక్కో లబ్ధిదారుడికి ఏకంగా రూ.40వేల వరకు ఎగనామం పెట్టాడు. కానీ, చంద్రబాబు అధికారంలోకి రాగానే హామీ మేరకు రూ.4 వేలకు పెంచడమే కాకుండా ఏప్రిల్ నుంచే పెంపు అమలు చేశారని వివరించారు.

### భారీ వర్షంలోనూ పెన్షన్ల పంపిణీ హర్షణీయం

పనులు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్న వారు, వితంతువులు, దివ్యాంగులు, కుల వృత్తులు చేసుకునే వారికి పెన్షన్లను ప్రారంభించింది కూడా చంద్రబాబేనని వివరించారు. ఇప్పుడు కూడా ఒకటో తేదీ ఆదివారం రావడంతో.. ఒక రోజు ముందుగానే పెన్షన్లు అం దించాలని ఆదేశించినట్టు చెప్పారు. గతంలో 10వ తేదీ వరకు పెన్షన్లు పంపిణీ చేసే వారని,కానీ తాము ఒకేరోజు 100శాతం పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామని వివరించారు. పెన్షన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగుల చొరవ అభినందనీయమని తెలిపారు.భారీవర్షంలో కూడా ఉద్యోగులు ఉదయాన్నే పంపిణీ చేయడాన్ని ప్రశంసించారు.నిండు గర్భిణీ అయిన ఒక ఉద్యోగిని పాల్గొనడం హర్షణీయమన్నారు.ఆమె చిత్తశుద్ధికి ధన్యవాదాలు తెలిపారు. పెన్షన్ల పెంపు, ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేయడం పట్ల పెన్షన్‌దారులు హర్షం వ్యక్తం చేశారు.

టెక్కలి నియోజకవర్గంలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు.



# పేదల సంక్షేమమే ఎన్డీయే ధ్యేయం

## అవ్వతాతలు, వికలాంగులు ఇబ్బంది పడకూడదనే రోజుముందే పింఛన్ల పంపిణీ



అమరావతి (చైతన్య రథం): పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం ప్రకాశం జిల్లా దేవరాజుగట్టులో టీడీపీ ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి వర్షాలను లెక్కచేయకుండా మంత్రి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డోలా మాట్లాడుతూ... సెప్టెంబర్ 1 ఆదివారం కావడంతో అవ్వతాతలు, వికలాంగులు ఇబ్బంది పడకూడదనే రోజు ముందుగానే పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం పించను 4 వేలు పెంచాం. రూ.3 వేలు పించను ఇస్తానని జగన్ వృద్ధుల్ని మోసం చేశారు. రూ. వెయ్యి పెంచడానికి జగన్‌కి ఐదేళ్ళు పట్టింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం మేరకు పెన్షన్‌ని రూ.4,000కు పెంచడం, మూడు నెలల బకాయిలు కలిపి మొత్తం రూ.7,000 పెన్షన్ జులై మాసంలోనే ఎన్డీయే కూటమి ఇచ్చిందన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఇంత పెద్ద ఎత్తున పెన్షన్లు ఇస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామని మంత్రి చెప్పారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను అమలుచేస్తూ ఉద్యోగావకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో మొత్తం 2 లక్షల 91 వేల 534 మందికి ఈ రోజు 199 కోట్ల రూపాయలు పింఛన్ కింద ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. యర్రగొండపాలెం నియోజక వర్గంలో 36,581 మందికి 25 కోట్ల రూపాయలు ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లు అందచేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

### అదీ.. జగన్ మోసం

వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి జగన్ జిల్లా ప్రజలను మోసం చేశారన్నారు. చేసిన మోసానికి జిల్లా ప్రజలు జగన్‌కి తగిన బుద్ధి చెప్పారని, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసేది మేమే, నీళ్లు ఇచ్చేది మేమేనన్నారు. వైసీపీ నేతలు దోచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని, రాష్ట్రంలో త్వరలోనే సీసీ రోడ్లు ప్రారంభించి 5 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### వర్షాలపై సమీక్ష

భారీ వర్షాలు, వరదలపై అధికారులతో శనివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా సమీక్షించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ, కలెక్టర్, రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల, సంక్షేమ వసతి గృహాల ఉన్నతాధికారులతో మాట్లాడారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప ఇంటినుంచి బయటకు రావొద్దని జిల్లా ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. అధికారులంతా అందుబాటులో ఉండాలని, ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు.

# చెరువులను తలపించిన రోడ్లు

అమరావతి (చైతన్య రథం) ఎడతెరిపిలేని వాన విజయవాడ, గుంటూరు ప్రాంతాలను అతలాకుతలం చేసింది. వర్షంతో పలుచోట్ల రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. విజయవాడలోని విద్యాధరపురం, ఆర్ఆర్ నగర్‌లో రహదారులు జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరింది.

విజయవాడ బస్టాండ్ పరిసరాలు నీట మునిగాయి. వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు తప్పలేదు. రామవరప్పాడు రింగ్ రోడ్‌నుంచి నిడమానూరు వరకు ట్రాఫిక్ స్తంభించి వాహనాలు నిలిచిపోయాయి. భారీ వర్షాలకు మొగల్రాజపురం సున్నపుబట్టీ సెంటర్ వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. ఘటనలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ కింద భారీగా వర్షపు నీరు చేరింది.దీంతో జాతీయ రహదారిపై వాహన రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. విజయవాడలోని దుర్గగుడి ఫ్లై ఓవరును తాత్కాలికంగా మూసివేశారు. బ్రిడ్జి దగ్గర వర్షపు నీరు నిలవడంతో.. మూడు బస్సులు, ఒక లారీ అందులో చిక్కుకున్నాయి. భారీవర్షాలకు గుంటూరు నగరంలో గడ్డిపాడు చెరువు పొంగిపొర్లుతోంది. సమీపంలోని ఇళ్లలోకి నీరు చేరడంతో.. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళగిరి టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షపు నీటితో ఆ ప్రాంతం జలాశయాన్ని తలపించింది. దీంతో గుంటూరు-విజయవాడ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాలు అపుకోవాలని అధికారులు సూచించారు. భారీ వర్షం కారణంగా గుంటూరు ఆటోనగర్, పెద్దకాకాని పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. పెదకాకాని మండలం నంబూరు చెరువు పొంగడంతో గ్రామంలోని ఇళ్లలోకి నీరు చేరింది. వీధులు జలమయమయ్యాయి.



### ఇంద్రకీలాద్రిపై విరిగిపడిన కొండ చరియలు ??

భారీ వర్షాలు విజయవాడ నగరాన్ని అతలాకుతలం చేశాయి. ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్‌లో కొండ చరియలు విరిగిపడి ప్రొటోకాల్ ఆఫీస్, డోనర్ సెల్ ధ్వంసమయ్యాయి. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి ఘాట్‌రోడ్లో పలుచోట్ల కొండచరియలు పడ్డాయి. ఆ ప్రదేశంలో భక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు ఇవాళ ఉదయం నుంచే ఘాట్‌రోడ్ మూసేశారు. మధ్యాహ్నా సమయంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దుర్గగుడి సమీపంలోనే సమాచార కేంద్రం (ప్రొటోకాల్ ఆఫీస్) ఉంటుంది. ఇక్కడ ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు విధుల్లో ఉంటారు. నలుగురు సిబ్బంది భోజనానికి వెళ్లిన సమయంలో బండరాళ్లు పడి ప్రొటోకాల్ ఆఫీస్ పూర్తిగా నేలమట్టమైంది. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిలో రాకపోకలు స్తంభించాయి. ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

### వరదలపై సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలపై సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీసీఎల్ఏ విజయలక్ష్మి నేతృత్వంలో 19మంది అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ప్రతి జిల్లాలో కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నాలుగు ప్రాంతాలకు నలుగురు అధికారులను నియమించారు. ఆర్టీజీఎస్ కంట్రోల్ రూమ్‌కు ఐఏఎస్ అధికారి కోన శశిధర్‌ను నియమించారు. 14,700కు పైగా ఉన్న సీసీ కెమెరాల ఫీడ్‌ను అధికారులు విశ్లేషించనున్నారు. ఆర్ అండ్ బీ, విద్యుత్, మున్సిపల్ శాఖలు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కీలక శాఖల అధికారులు వర్షాలు, వరద పరిస్థితులను సమీక్షించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

### ముంపును పరిశీలించిన మంత్రి కొలుసు

ఏలూరు జిల్లా నూజివీడు పట్టణానికి సమీపంలో మొగలు చెర్వు, పోతిరెడ్డిపల్లి ఊర చెర్వు, అన్నవరం పెద్దచెర్వు గట్లు భారీ వర్షాలుకు తెగిపడి పోవడంతో నూజివీడు పట్టణ సమీపంలోని వెలంపేట తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి.

ఈ ప్రాంతాలను రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంభందాల మంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించి ప్రజలను, అధికారులను అప్రమత్తం చేశారు. ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను నూజివీడు జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌కు తరలిస్తున్నారు. బాధితులకు అవసరమైన మంచి నీరు, ఆహారం, ఇతర అవసరమైన ఏర్పాట్లును చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వర్షాలు వలన అంటురోగాలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ఏవిధమైన పరిస్థితినైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

అత్యవసర పరిస్థితి ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని సిద్ధం చేశామని మంత్రి చెప్పారు. వర్షం నీరు నిల్వవున్న కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని మంత్రి మునిసిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, మలాథియాన్ స్ప్రే చేయాలనీ మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రివెంట ఎస్పీ కె. శివప్రతాప్ కిశోర్, ఆర్డీఓ వై. భవానీశంకరి, మునిసిపల్ కమిషనర్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.









# భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి
- వేటకు వెళ్లిన మత్స్యకారులను వెనక్కు రప్పించాలి
- గాలులకు తెగిపడిన విద్యుత్ తీగలను సరిచేయించాలి
- గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలి
- మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా భారీవర్షాల నేపథ్యంలో అధికా రులు అప్ర మత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టా లని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటకు రావొద్దని తెలిపారు. జలమయమైన లోతట్టు ప్రాంతాల్లో రోడ్డు, రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడకుండా రెవెన్యూ, యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈదురుగాలు లకు విద్యుత్ తీగలు తెగిపడిన చోట్ల తక్ష ణమే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాలకు ఉధృతంగా ప్రవహించే వాగుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని సూచించారు. పలు చోట్ల విష జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామా ల్లో పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేపట్టాలని తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్న ప్రాంతాల్లో చెరువులు నిండుతాయని, అలాంటి చోట్ల నీటిపారుదల శాఖ అధికారులు చెరువు లను నిత్యం పర్యవేక్షించాలని, అవసరమైతే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. అలాగే పెన్షన్ పంపిణీ సమయంలో ఎటువంటి ప్రమాదాలకు గురవకుండా రెవెన్యూ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భారీవర్షాలు కురుస్తున్న ప్రాం తాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించాలన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ల కుండా హెచ్చరికలు జారీ చేయడంతో పాటు ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన వారు జాగ్రత్తగా తీరం చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.



చైతన్యరథం

# రూరల్ ఎంప్లాయిమెంట్‌తో గ్రామాభివృద్ధి

**విద్యార్థులు గ్రామాల్లో రీసెర్చ్ చేయాలి - ఐఎస్ఎఫ్ అంకుర యాత్ర ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని**




తాడేపల్లి (చైతన్యరథం): "కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులు రూరల్ గ్రామాల్లోని రైతుల సమస్యలు, క్రిమి కీటకాల నివారణ వంటి అంశాలపై రీసెర్చ్ చేయాలి. రూరల్ ఎంప్లాయిమెంట్ క్రియేట్ చేయగలితే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుంది. చంద్రబాబు వంటి విజన్ ఉన్న నాయకుడు ఉన్నప్పుడే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ధైర్యంగా ముందుకు రాగలరు." అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో జరిగిన ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) వారి అంకుర యాత్ర ప్రారంభ కార్యక్రమానికి శనివారం హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ... స్టార్ట్ అప్ ఎకో సిస్టం ద్వారా దీర్ఘకాలంలో స్థిరమైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, కాలిఫోర్నియా మాదిరిగా ఏపీలోనూ స్టార్టప్‌లు తీసుకొచ్చేందుకు ఐఎస్ఎఫ్ ప్రయత్నం చేస్తోందని చెప్పారు. అమెరికాలో స్థిరపడినప్పటికీ వారు ఏపీకి వచ్చి గ్రామీణ ప్రాంతాల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో స్వయం సహాయక సంఘాల్లోని సుమారు 10 కోట్ల మంది చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ లక్ష రూపాయల వరకు సంపాదిస్తున్నారని తెలిపారు. వీరిలో కొందరు రూ.20 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు కూడా సంపాదిస్తున్నారని, ఇలాంటి వారికి సహకారం అందించాలని సూచించారు.

వ్యాపారానికి వయసుతో సంబంధం లేదు

వ్యాపార రంగంలో అడుగు పెట్టాలనుకునే వారికి వయసుతో సంబంధం లేదని, తాను విద్యార్థిగా ఉంటూనే వ్యాపార రంగంలోకి అడుగు పెట్టానని పెమ్మసాని వివరించారు. తొలుత 20-30 మంది విద్యార్థులకు బోధించానని, అమెరికా అంతటా తన మెటీరియల్ చదవాలనే లక్ష్యంతో పని చేశానని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కూడా ఇదే లక్ష్యంతో పారిశ్రామిక రంగంలో అడుగు పెట్టాలని సూచించారు. ఇతర దేశాల్లో అవలంభిస్తున్న పారిశ్రామిక విధానాలను కూడా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. త్వరలో **myguntурmp.in** ప్రజల కోసం పోర్టల్ ప్రారంభిస్తున్నాం. దీని ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ ప్రాజెక్టుల గురించి తెలియజేస్తే ప్రభుత్వపరంగా సహకారం అందించేందుకు కృషి చేస్తాం' అని పెమ్మసాని అన్నారు. అనంతరం అంకుర యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు కార్యక్రమంలో ఐఎస్ఎఫ్ ఛైర్మన్, ఫౌండర్ డాక్టర్ జేఏ చౌదరి, కేఎల్ వర్సిటీ ఛైర్మన్ డాక్టర్ కోనేరు సత్యనారాయణ, ఐఎస్ఎఫ్ కో-ఫౌండర్లు దీనానంద్, సత్యేంద్ర, శివమహేష్, శ్రీకాంత్, కేజీఎంజీ మేనేజింగ్ పార్టనర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని**



చంద్రగిరి చైతన్యరథం: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్‌ను అవ్వ, తాతలకు సెప్టెంబర్ 1వ తేదీన ఇవ్వవలసిన ఉండగా ఒకరోజు ముందుగానే ఆగస్టు 31వ తేదీన అందించినట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. యర్రావారిపాలెం మండలం, మేదరపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్‌ను కూటమి పార్టీ మండల నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన ఆదివారం కావడంతో ప్రభుత్వం ముందు రోజు ఆగస్టు 31వ తేదిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ 100 శాతం పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. సెప్టెంబర్ 1న ఆదివారం సెలవు దినం ఉన్నందున ముఖ్యమంత్రి సదరు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఒక రోజు ముందుగానే సచివాలయం సిబ్బం ద్వారా పెన్షన్ లబ్ధిదారులకు పెంచిన పెన్షన్ ను అందించడం జరుగుతుందని తెలిపారు. పెన్షన్‌దారులు ఇంటి వద్దనే ఉండి పెన్షన్ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కక్షపూరితమైన రాజకీయాలకు తావు లేకుండా చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు కృషి చేస్తానని, అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

## అప్రమత్తంగా ఉండండి... ఏ ఆపద వచ్చినా సమాచారం అందించండి

**ప్రజలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచన**



గురుజాల (చైతన్యరథం): 'గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గురజాల నియోజకవర్గ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. వర్ష ప్రభావం తగ్గేంతవరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైన మేరకే బయటకు వెళ్ళాలి. పిల్లలు వర్షంలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోండి. భారీగా ప్రవాహం వచ్చే నదులుగానీ, ప్రవాహాన్ని గాన్ని దాటొద్దు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. జాగ్రత్తలు వహించండి.' అని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వర్షాలకి ఎక్కడ రైతాంగం ఇబ్బంది పడకుండా, సామాన్యులు ఇబ్బంది పడకుండా ఎక్కడికక్కడ పోలీసులు, రెవిన్యూ, మున్సిపల్ సిబ్బంది అలర్ట్ గా ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. త్రాగునీరు పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలి. వర్ష ప్రభావం వల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది కాబట్టి డ్రైనేజీ, వర్షం నీరు వెళ్లే విధంగా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాను. ప్రజలు కూడా అందరు సహకరించండి. కూటమి నాయకులు అన్నివేళలా అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఏ అవసరం వచ్చినా అండదండలుగా ఉండండి.ఎక్కడ ఏ ఆపద వచ్చినా పార్టీ కార్యాలయానికి సమాచారం అందిస్తే సహాయక చర్యల్లో పాల్గొంటామని యరపతినేని తెలిపారు.

## వైద్య రంగంలో రేడియాలజిస్టులది కీలకపాత్ర

**- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



నెల్లూరు, చైతన్యరథం: అడ్వాన్స్‌డ్ ఇమేజింగ్ ద్వారా రేడియాలజిస్టులు రోగ నిర్ధారణ చేస్తూ అద్భుతాలు ఆవిష్కరిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వారి సేవలను ప్రశంసించారు. నెల్లూరు నగరంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి రేడియాలజిస్టుల వార్షిక సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ సైన్స్‌ను టెక్నాలజీతో అనుసంధానం చేసి వైద్య రంగంలో రేడియాలజిస్టులు విప్లవాత్మక మార్పులు తెస్తున్నారన్నారు. ఇమేజింగ్ సిస్టంతో పిన్ హోల్ విధానం ద్వారా శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా అందిస్తున్న వైద్య సేవల వల్ల రోగి త్వరగా కోలుకునే అవకాశముందన్నారు. రేడియాలజీలో మెమోగ్రఫీ ముఖ్యమైనదని ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో క్యాన్సర్‌వ్యాధి వస్తే సామాన్యులు వైద్యం చేయించుకోలేని పరిస్థితి వుండేదని, రేడియాలజి రంగం అభివృద్ధి చెందాక ప్రాథమిక దశలోనే వ్యాధి నిర్ధారణ చేసే పరిస్థితి ఉందన్నారు. రోగ నిర్ధారణ రంగంలో మరిన్ని పరిశోధనలు చేసి వైద్యాన్ని సులభతరం చేసి ప్రజలకు మేలు చేసే దిశగా కృషి చేయాలని కోరారు.

## పింఛన్లపై దుష్ప్రచారం చేసినవాళ్లు తలలు ఎక్కడ పెట్టుకుంటారు?

**లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం): కూటమి గెలిస్తే సంక్షేమం ఆగిపోతుంది, పెన్షన్లు రావంటూ తప్పుడు ప్రచారం చేసిన బ్లూ బ్యాచ్ వాళ్ళంతా ఇప్పుడు తలలు ఎక్కడ పెట్టుకుంటారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. అన్నమాట ప్రకారమే జులై-1 నుంచి రూ.4వేల పింఛను ఠంఛనుగా అందిస్తున్న ప్రభుత్వంపై ఇకనైనా నిందలు మానుకుని క్షమాపణలు చెబుతారా అని నిలదీశారాయన. సెప్టెంబర్-1 ఆదివారం కావడంతో ఆగస్టు 31నే పింఛను అందించమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించడం, ఆ మేరకు సచివాలయ సిబ్బందితోనే స్వల్పవ్యవధిలో నే పింఛన్ల పంపిణీ పూర్తి చేయడం తమ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శమన్నారాయన. చిలకలూరిపేట 34, 35వ వార్డులతోపాటు గంగన్నపాలెం, గోవిందపురంలో పలువురు లబ్ధిదారులకు శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పంపిణీ చేశారు. ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురుస్తున్నా లబ్ధిదారులకు పింఛను నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన రాష్ట్ర చరిత్రలో ఒకటో తేదీకి ముందుగానే పింఛన్లు పంపిణీ చేయడం ఇదే తొలిసారి అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 65.18 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జులై 1న రూ.7 వేల చొప్పున ఇచ్చామని, ఇప్పుడు రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.15 వేల చొప్పున లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు నెలనెలా డబ్బులు వస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. అలానే అర్హత ఉండి పింఛన్ రానివారికి, అర్హత ఉండి కార్డు లేనివారికి త్వరలో సీఎం చంద్రబాబు ప్రకటించే అవకాశం ఉందన్నారు. అర్హత కలిగి పింఛన్లు రానివారితో పాటు గత వైసీపీ ప్రభుత్వం తొలగించిన వారు ఉంటే వీలైనంత త్వరలోనే ప్రకటన వస్తుందన్నారు. సీఎం చంద్రబాబు ఏరోజు ప్రకటిస్తే ఆరోజు అర్హత ఉన్నవారితో పాటు మంచాన పడినవారికి కూడా పింఛన్లు మంజూరు చేస్తామన్నారు.

## జోరు వర్షంలోనూ కొనసాగిన పెన్షన్ల పంపిణీ

**నెల్లూరు సిటీ 47వ డివిజన్‌లో లబ్ధిదారులకు అందజేత**



నెల్లూరు (చైతన్యరథం): జోరు వర్షంలోనూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జోరుగా కొనసాగింది. శనివారం ఉదయం నగరంలోని 47 డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. తెల్లవారుజామున 5.30 గంటలకు మొదలైన ఈ కార్యక్రమం 11 గంటలకు పూర్తి చేశారు. సెప్టెంబర్ 1వ తేదిన ఆదివారం కావడంతో అంతకంటే ముందే అంటే ఆగష్టు 31వ తేదినే రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక పెన్షన్ల పంపిణీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నారని, పెరిగి పెన్షన్లు ఒకటోతేదినే లబ్ధిదారులకు అందజేయడం శుభపరిణామమన్నారు. వైసీపీ హయాంలో వాలంటీర్ల ద్వారా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడంతో నిధులు పక్కదారి పట్టి లబ్దిదారులకు న్యాయం జరిగేది కాదన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టి ఒక్కరోజులోనే రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేయడం ఒక రికార్డ్ అని ధర్మవరపు సుబ్బారావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్ ఛార్జ్ డాక్టర్ గణేష్ కుమార్, ఎనికిపాటి చెంగయ్య, కలవకుంట భాస్కర్ , సిద్ధకళాచారి, సీమకుర్తి వెంకటేశ్వర్లు, పద్మాబాయి , కంచి కృష్ణ , పెంచలయ్య , రాధాకృష్ణ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# నెల్లూరు రూరల్‌లో వైసీపీ ఖాళీ

**మొత్తం 13 మంది కార్పొరేటర్ల చేరికకు రంగం సిద్ధం - ముగ్గురు కార్పొరేటర్లకు నో ఎంట్రీ : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**

నెల్లూరు, చైతన్యరథం: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నూతన చేరికలకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం మొత్తం 26 మంది కార్పొరేటర్ లు ఉండగా ఇప్పటికే కోటంరెడ్డి సోదరుల వెంట 9 మంది కార్పొరేటర్‌లు ఉన్నారు. మరో 13 మంది కార్పొరేటర్లు కోటంరెడ్డి సోదరులను కసి పార్టీలో చేరేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతో వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ విశాల భవిష్యత్తు నేపథ్యంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నూతన చేరికలకు అంగీకారం తెలిపారు. మరోవైపు మంత్రి నారాయణ సామర్థ్యంలో నెల్లూరు నగరంలో మరో పదహారు మంది వైసీపీ కార్పొరేటర్లు త్వరలోనే టిడిపి తీర్థం పుచ్చుకోనున్నారు. నెల్లూరు రూరల్‌కు సంబంధించి మిగి ఉన్న మరో ముగ్గురు కార్పొరేటర్లకు మాత్రం కోటంరెడ్డి సోదరులు ఇప్పటివరకు అంగీకారం తెలపలేదు. ఈ ముగ్గురిలో కూడా ఇద్దరు కార్పొరేటర్‌లు కోటంరెడ్డి సోదరులకు ఫోన్లు చేసి తమను టిడిపిలో చేర్చుకోవాలని ప్రాధేయపడుతున్నారు. గత ఎన్నికలకు ముందు కొన్ని తప్పులు చేసామని వాటిని మన్నించాలని కోరుతున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ముగ్గురు కార్పొరేటర్లు అశోక్ నాయుడు, పేనేటి సుధాకర్, రియాజ్ సతీమణి ఫామిదా తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. టిడిపిలో నూతన చేరికల అనంతరం నెల్లూరు నగర కార్పొరేషన్‌లో వైసీపీ పూర్తిగా ఖాళీ కానుంది.

# ఒక రోజు ముందుగానే పెన్షన్ అందిస్తున్నాం

***- కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు***



కాకినాడ (చైతన్యరథం): సామాజిక భద్రతలో భాగంగా ఎన్టీఆర్ పెన్షన్ భరోసా క్రింద పెన్షన్ లబ్ధిదారులకు ఒకరోజు ముందు గానే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందజేస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక 39 వ డివిజన్ రామారావు పేట నందు సచివాలయ సిబ్బంది తదితరులతో కలిసి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్లను అర్హులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ లబ్ధిదారులకు అందజేస్తుందన్నారని, సెప్టెంబర్ ఒకటవ తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే ఆగస్టు 31వ తేదీన లబ్ధిదారులు అందరికీ పెన్షన్ అందజేస్తున్నామన్నారు. ఉదయం నుంచి ఎడ తెరపి లేకుండా వర్షం పడుతున్నప్పటికీ లెక్కచేయకుండా అధికారులు ఎన్డీఏ కూటమి నాయకులు తెల్లవారు జాము నుంచే లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పెన్షన్ అందజేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. గత ప్రభుత్వంలో వివిధ కారణాల చేత లబ్ధిదారులకు తొలగించిన పెన్షన్‌ను వారి అర్హతఆధారంగా తిరిగి పెన్షన్ అందించే ప్రక్రియను త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టనున్నారన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రాధాన్యత క్రమంలో హామీలను నెరవేర్చుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పెంచిన పెన్షన్ లను లబ్ధిదారులకు అందిస్తున్నామని, అన్నా క్యాంటీన్ లను ప్రారంభించు కోవడం జరిగిందని, ఎన్డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని కొండబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాలెండర్‌లో డేట్ మారకముందే.. 98% పెన్షన్లు పంపిణీ

**- మాట ఇచ్చాం.. ఇంటి వద్దకు వచ్చి పెంచిన పింఛన్ అందిస్తున్నాం**

**- అర్హత ఉంటే పార్టీలు చూడం.. ఇది ప్రజా ప్రభుత్వం**

**- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత**



రాప్తాడు (చైతన్యరథం): క్యాలెండర్‌లో డేట్ మారకముందే.. రాష్ట్రంలో 98శాతం మందికి పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వం ఇది అని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కనగానపల్లి మండలం నరసంపల్లి పంచాయతీ సోమరవాండ్లపల్లి గ్రామాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. స్థానిక పంచాయతీ సర్పంచ్ చంద్రశేఖర్, కన్వీనర్ పోతలయ్య, గ్రామస్తులు, అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. ముందుగా వారి కుటుంబ పరిస్థితులు తెలుసుకుని.. ప్రతి నెల ఇంటి వద్దకే పింఛన్లు అందిస్తున్నారా అంటూ ఆరా తీశారు. పింఛన్ల పెంపుపై లబ్ధిదారుల స్పందన తెలుసుకున్నారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేది ఆదివారం ఉండటం వలన ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా ఒక్క రోజు ముందే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికల ముందు పింఛన్లు పెంచుతామని చెప్పామని.. అలాగే ఇంటి వద్దకే వచ్చి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ వైసీపీ నాయకులు ఇది సాధ్యం కాదని ఎద్దేవా చేశారని.. ఇప్పుడు వారు కూడా తాము పింఛన్లు అందిస్తున్న తీరు చూసి నోళ్లు మూసుకుంటున్నారని కామెంట్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట ఇచ్చారంటే అది కచ్చితంగా నెరవేరుస్తారని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని.. గత ప్రభుత్వంలో లాగా పార్టీలు చూసే పరిస్థితి ఉండదన్నారు. అర్హత ఉంటే ఇంకా కొత్త పింఛన్లు కూడా ఇచ్చే కార్యక్రమం త్వరలోనే ఉంటుందని సునీత స్పష్టం చేశారు.

# తిరుపతిలో 5వ విడత ప్రజాదర్బార్

***ప్రజల నుంచి వినతులు స్వీకరించిన గొల్ల నరసింహయాదవ్***



తిరుపతి (చైతన్యరథం): తిరుపతిలో 5వ విడత ప్రజాదర్బార్ ను శనివారం తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ కార్యాలయం నందు తుడా మాజీ చైర్మన్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టారు. పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల నుండి పలువురు ప్రజా సమస్యలపై వినతులను సమర్పించారు. తిరుపతి నియోజకవర్గంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద తుడా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ కార్యక్రమానికి సంబంధించి నిధులను ఎంత మొత్తం కేటాయించారు? నిర్మాణంలో ఉన్న ఫ్లాట్స్ ఎవరెవరు కొనుగోలు చేశారు? ఎంత రేటుతో ఫ్లాట్లు అమ్మకాలకు పెట్టారు? దీనిపై తగిన విచారణ జరిపించి ప్రజల ముందు ఉంచాలని వినతులు ఇచ్చిన వారు కోరారు. దీనిపై స్పందిస్తూ మాజీ తుడా చైర్మన్ నరసింహ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ... మున్సిపల్ శాఖకు సంబంధించిన మంత్రి ఈ వినతులన్నీ కూడా సమర్పించి నిర్మాణ పనులలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలని కోరుతామని తెలిపారు. తదుపరి వినతుల పరిశీలనలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన ఇందిరా మైదానంలోని ఇండోర్ స్టేడియంను ప్రజలకు వినియోగంలోకి తేవాలని కోరారు. నగరంలోని కొన్ని డివిజన్ నందు డ్రైనేజీ వ్యవస్థ మురుగనీటి కాలువలలో చెత్తాచెదారంతో మునిగిపోతూ కాలువలు శుభ్రంగా లేనందున 12వ డివిజన్లో ప్రజలు చాలా అనారోగ్యానికి గురవుతున్నారని వినతి పత్రాల్లో తెలియజేశారని తెలిపారు. అదే విధంగా ద్వారా నీటి సరఫరా సరైన టైమ్ కు సరఫరా చేయకుండా నిర్దిష్టమైన సమయాన్ని కేటాయించక ఎప్పుడు పడితే అప్పుడు కుళాయిలకు నీరు అందించడం వల్ల ప్రజల అసౌకర్యానికి గురవుతున్నారు. కావున నీటి సరఫరాను నిర్దిష్టమైన సమయం కేటాయించాలని కోరుతున్నారు. మరొక వినతి పత్రంలో వీధి కుక్కల బెడద ఎక్కువైనందువలన చిన్న పిల్లలకు పెద్దలకు కూడా కుక్కకాటులకు బలి అవుతున్నట్లు సమాచారం అందించారు. రాత్రి వేళల్లో కొంతమంది యువకులు గ్రూపులుగా ఏర్పడి మాట్లాడుకుంటున్న వైనం వల్ల పరిసర ప్రాంతాల్లోని ఆడపిల్లలకు చాలా ఇబ్బందికరంగా గాను ఉందని తెలియజేస్తూ దీనిపై నిఘా ఉంచి సంచార పోలీసు దళంతో కట్టడి చేయాలని కోరినట్లు తెలిపారు. తమకు అందిన వినతి పత్రాలు పరిశీలించి అందుకు సంబంధించిన ఆయా శాఖ అధికారులకు తెలియజే స్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయం కార్యదర్శి చేజర్ల మనోహరా చారి, జిల్లా కార్యదర్శి అమ్మ గుంట యశ్వంత్ రెడ్డి, జిల్లా మీడియా కోఆర్డినేటర్ చింతాచంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వర్షంలోను అగని పెన్షన్ల్ పంపిణీ

***- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు***



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): జోరువానలో సైతం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు కొనసాగించారు. శనివారం జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామంలో సచివాలయ సిబ్బందితో కలిసి టిడిపి శ్రేణులు ఇంటిఇంటికి తిరిగి సామాజిక పెన్షన్ల పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఆదివారం శెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్ నగదు అందిస్తున్నామని, మీ ఆశీర్వాదం, మద్దతు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఈ ప్రభుత్వానికి ఉండాలి అని కోరారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని మొత్తం 64,61,485 మంది పెన్షనర్ల కోసం 2,729 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది అని తెలిపారు. అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుంది అని తెలిపారు. ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎలికే వర ప్రసాద్, తడికల మోహన్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, రాగాని శ్రీను, తడికల దావీదు, ప్రసాద్, శ్రీను సచివాలయ సిబ్బంది సాయి, వెంకట్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# మన టీడీపీ యాప్‌ను ప్రజలకు చేరవేయండి

**పలువురి కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి**



కనిగిరి (చైతన్యరథం): మన టీడీపీ యాప్ ద్వారా పార్టీ సమాచారాన్ని విస్తృతస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో ప్రతిభ చూపడం అభినందనీయమని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఇమేజ్‌ను దెబ్బతీయడానికి జగన్ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పి కొట్టి కూటమి అద్భుత విజయం సాధించే వరకు అనేక రకాలుగా పార్టీకి, నాకు అండగా నిలిచిన ఐటీడీపీ శ్రేణుల రుణాన్ని తీర్చుకోలేనని కొనియాడారు ఈసందర్భంగా ఎన్టీఆర్ భవన్ నుంచి మంత్రి నారా లోకేష్ పామూరు శ్రేణులకు పంపించిన ప్రశంసాపత్రాలను శని వారం కనిగిరిలోని అమరావతి కార్యాలయంలో డాక్టర్ ఉగ్ర అందజేశారు.. ఉగ్ర చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకొన్న వారిలో పోకా నాయుడుబాబు, షేక్ ఖాజారహంతుల్లా, పువ్వాడి వెంకటేశ్వర్లు, మన్నం రమణయ్య కమ్మబాలకృష్ణ, ఫత్తు మస్తాన్, గద్దె వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.